ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

సోమవారం 15 సెప్టెంబరు 2025

అధ్వానంగా రహదారులు

పట్టించుకోని పాలకులు

● గిరిజనులకు తప్పని ఇక్కట్లు

8 లో



కొండలపై అక్రమార్కుల కన్ను

● ఇప్పటికే బడిదేవరకొండపై గ్రానైట్ తవ్వకాలు

● రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఉన్నా వెనక్కి తగ్గని వైనం

● తాజాగా వెలుగుల మెట్టపై దృష్టి

● క్వారీ వద్దంటున్న రెండు గ్రామాల ప్రజలు

● ప్రజాభిప్రాయ సేకరణలో నిరసన

● అధికారులు ఏ నిర్ణయం తీసుకుంటారో?



వెలుగుల మెట్ట ఇదే..

పార్వతీపురం, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పచ్చని కొండలపై అక్రమార్కుల కన్నుపడింది. ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతం బడిదేవర కొండపై యథేచ్ఛగా గ్రానైట్ తవ్వకాలు చేపడుతున్న విషయం తెలిసిందే. పార్వతీపురం మండలం డీకేపట్నం తదితర పంచాయతీల పరిధిలో ఉన్న పచ్చని కొండలను పిండి చేస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. మరోవైపు పంటలు దెబ్బ తింటున్నా, చెరువులు కలుషితమవుతున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. దీనిపై ఆయా ప్రాంత గిరిజనులు, రైతులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా.. తవ్వకాలు ఆగడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం కాలంలో అనుమతులు పొందిన వారు ఇప్పుడు బడిదేవర కొండ వద్ద తవ్వకాలు జరిపి విలువైన గ్రానైట్‌ను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కాగా ఇప్పుడు గ్రానైట్ వ్యాపారులు పార్వతీపురం మండలం హెచ్.కారాడవలస, పెద్ద బొండపల్లి గ్రామాల రెవెన్యూ పరిధిలో ఉన్న వెలుగుల మెట్టపై దృష్టి కేంద్రీకరించారు. ఆ ప్రాంతంలో గ్రానైట్ తవ్వకాలకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలోనే వారు అనుమతులకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. వాస్తవంగా ఈ ప్రాంతంలో తవ్వకాలు చేపడితే ఆ రెండు గ్రామాలతో నరిసిపురం తదితర ప్రాంతాల్లో పంటలు దెబ్బతినే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో ఆ ప్రాంతవాసులు నిరసన తెలిపారు. తమ ప్రాంతంలో క్వారీ వద్దని ముక్తకంఠంతో నినదించారు. గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు ఇస్తే సహించేది లేదని తెలిపారు. దీనిపై అధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకుంటారన్నది వేచి చూడాల్సి ఉంది.



వెలుగుల మెట్ట వద్ద గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వవద్దంటూ ప్రజాభిప్రాయ సేకరణలో ఆందోళన చేస్తున్న స్థానికులు (ఫైల్)

అనుమతులు ఇవ్వొద్దు..

'మా ప్రాంతంలో గ్రానైట్ తవ్వకాలు చేపట్టవద్దు. రైతుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఎటువంటి అనుమతుల మంజూరు చేయొద్దని అధికారులకు తెలియజేశాం. ప్రజాభిప్రాయాలను గౌరవిస్తారని ఆశిస్తున్నాం. కారాడ వలసకు చెందిన సత్యరానాయణ, మండల ఫకీరు నాయుడు తదితరులు తెలిపారు. దీనిపై డీఆర్వో హేమలతను వివరణ కోరగా.. ప్రజాభిప్రాయాలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు తెలియజేశామన్నారు. సంబంధిత అధికారుల నుంచి నివేదిక రావల్సి ఉందని తెలిపారు.

అసలు గుట్టు ఇది..

రిజర్వ్ ఫారెస్ట్‌లో గ్రానైట్ (మిగతా 8వ పేజీలో..)

బడిదేవరకొండపై కలెక్టర్ ఆరా..

పార్వతీపురం మండలం కోరి పంచాయతీ రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్న బడిదేవరకొండపై చేపడుతున్న గ్రానైట్ తవ్వకాలపై నూతన కలెక్టర్ ప్రభాకర్‌రెడి ఆరా తీశారు. ఈనెల 13న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన సమస్యలు ఇవిగో కథనంపై ఆయన స్పందించారు. ఈ మేరకు బడిదేవరకొండపై జరుగుతున్న గ్రానైట్ తవ్వకాలపై పూర్తి నివేదిక అందించాలని గనులశాఖకు కలెక్టర్ ఆదేశించారు. ఇక్కడి పరిస్థితిపై పూర్తిస్థాయిలో కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తే అసలు గుట్టు బయటపడనుంది.

బడిదేవర కొండ



సీఎం సదస్సుకు కలెక్టర్, ఎస్పీ

● జిల్లా నుంచి అమరావతికి పయనం ● నేడు, రేపు అక్కడే



కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి

పార్వతీపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో సోమ, మంగళ వారాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి అమరావతికి ఆదివారం పయనమయ్యారు. 18 నెలల పాలనా విధి విధానాలు, అమలు తీరుపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించనున్నారు. వచ్చే మూడేళ్లలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలు అమలులో వస్తున్న ఫిర్యాదులు క్రోడీకరించి నూరు శాతం సంతృప్తి స్థాయికి చేరే లక్ష్యాలను ఈ సదస్సుల్లో నిర్దేశించనున్నట్లు సమాచారం. జిల్లా అభివృద్ధి, శాంతిభద్రతలు తదితర అంశాలపై కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఎస్పీ మాధవరెడ్డికి దిశానిర్దేశం చేయనున్నారు. పార్వతీపురం, సాలూరు, పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో ప్రజలకు అవసరమైన సేవలను గుర్తించడంతో పాటు అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయడం, ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై వారికి సీఎం పలు సూచనలు చేయనున్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, పరిశ్రమలు, పర్యాటకం, హౌసింగ్ తదితర శాఖల పురోగతి జిల్లాలో ఎలా ఉందన్న అంశాన్ని కలెక్టర్ నుంచి ముఖ్యమంత్రి తెలుసుకోనున్నారు. సంక్షేమం, సూపర్‌సిక్స్ పథకాలు, అన్న క్యాంటీన్లు, పీ-4 తదితర అంశాలు ఎలా ఉన్నాయన్న దానిపై సమీక్ష నిర్వహించనున్నారు. రహదారులు, తాగునీటి ప్రాజెక్టులు తదితర అంశాల పురోగతిపై చర్చించనున్నారు.

గాలికుంటుతో ప్రమాదం

● పశువుల మృత్యువాత పడేఅవకాశం

● ముందస్తు జాగ్రత్తలే రక్ష

● నేటి నుంచి వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం



జియ్యమ్మవలస, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి)

పశువులకు సోకే ప్రధాన వ్యాధుల్లో గాలికుంటు ఒకటి. సకాలంలో వ్యాధి లక్షణాలు గుర్తించి నివారణ చర్యలు చేపట్టకపోతే పశువులు, వాటి పాలు తాగిన దూడలు మృత్యువాతపడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమానికి పశుసంవర్ధక శాఖ సిద్ధమైంది. ఈ నెల 15 (సోమవారం) నుంచి అక్టోబరు 15 వరకు నెల రోజుల పాటు ఈ వ్యాధి నివారణ టీకాలను పశువులకు వేయనున్నారు. 4 నెలలు దాటిన ప్రతి పశువుకూ ముందు జాగ్రత్త చర్యగా ఈ టీకా వేయించాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. 2019 పశు గణన లెక్కల ప్రకారం జిల్లాలో మొత్తం పశు పక్ష్యాదులు 14.67 లక్షలు ఉన్నాయి. ఇందులో ఆవులు 2.29 లక్షలు, గేదెలు 49 వేలు ఉన్నాయి. ఆవులు, గేదెలు కలిపి 2.78 లక్షలు ఉన్నాయి. వీటన్నిటికీ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసేందుకు జిల్లా పశు సంవర్ధక శాఖ సమాయత్తమైంది. దీనికోసం జిల్లాలో 24 మంది పశు వైద్యాధికారులు, 280 మంది సిబ్బంది సేవలు అందించనున్నారు.

వ్యాధి లక్షణాలు..

పశువుల్లో గాలికుంటు వ్యాధి లక్షణాలను సులువుగా గుర్తించవచ్చు. పశువుల్లో తీవ్రమైన జ్వరం రావడంతో పాటు నీరసించిపోతాయి. నోటి నుంచి తీగల వలే చొంగ కారుతూ ఉంటుంది. కాలి గిట్టలు, నోటి వద్ద పుండ్లు ఏర్పడతాయి. కొద్దిపాటి ఎండకు కూడా ఇవి తట్టుకోలేవు. చూడి పశువులు అయితే ఈనుకుపోతుంది. వీటి పాలు తాగే దూడలు మరణిస్తాయి. పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోవడంతో పాటు పశువుల పని సామర్థ్యం అంతేస్థాయిలో తగ్గుతుంది. దీనివల్ల పాడి రైతుకు ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లుతుంది. వైద్యంపై నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోతాయి. అందుకే టీకా వేయించుకోవాలి.

టీకాల వల్ల లాభాలు

నాలుగు నెలల వయసు దాటిన పశువులు, జీవాలకు ముందు జాగ్రత్త చర్యగా టీకా వేయించాలి. ఆవులు, గేదెలకు 2 మిల్లీ లీటర్ల చొప్పున టీకా ఇవ్వాలి. ఆరు నెలలకు ఒకసారి టీకా వేయిస్తే గాలి కుంటు వ్యాధి దరి చేరదు. ప్రభుత్వం ఉచితంగా టీకా వేస్తుంది. దీనివల్ల పాడి రైతుకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. పాల ఉత్పత్తి తగ్గకుండా ఉంటుంది. పని సామర్థ్యం తగ్గకుండా కాపాడవచ్చు. దూడల్లో మరణాలు సంభవించవు. అవి ఆరోగ్యంగా ఎదగడానికి ఉపయోగపడుతుంది.

సద్వినియోగం చేసుకోండి..



గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు వేయించాలి. రైతులు కచ్చితంగా మీ పాడి ఆవులు, గేదెలకు ఈ టీకా వేయించుకోండి. ఉచితంగా మా వైద్యాధికారులు, సిబ్బంది వేస్తారు.

-డాక్టర్ మన్మథరావు, జేడీ, పశు సంవర్ధకశాఖ, పార్వతీపురం మన్యం



సదస్సుకు హాజరైన మంత్రి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ జగదీశ్వరి, ఎమ్మెల్యేలు

మహిళా సాధికారత సదస్సులో
ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు

పార్వతీపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో తొలి జాతీయ మహిళా సాధికారత సదస్సు ఆదివారం ప్రారంభమైంది. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ఆధ్వర్యంలో వికసిత్‌కు భారత మహిళల నాయకత్వం అనే నినాదంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుకు ఉమ్మడి జిల్లాకు చెందిన మహిళా ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, పూసపాటి అదితి గజపతిరాజు, లోకం మాధవి పాల్గొన్నారు.

అంధకారంలో పార్వతీపురం

● ప్రధాన రహదారిపై వెలగని సెంట్రల్ లైటింగ్

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పట్టణంలో సాయంత్రం ఆరు గంటలు దాటితే చాలు అంధకారం నెలకొంటుంది. వారం రోజులుగా ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్ వెలగకపోవడంతో చీకట్లు కమ్ముకుంటున్నాయి. దీంతో నివాసితులు, పాదచారులు, వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చీకట్లో కుక్కలు తమపై దాడి చేస్తున్నాయని వారు వాపోతున్నారు. ఇప్పటికే పలుసార్లు సంబంధిత మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సెంట్రల్ లైటింగ్‌ను బాగు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై మునిసిపల్ ఏఈ సన్యాసిరావును వివరణ కోరగా ఆయన స్పందించలేదు.



వెలగని సెంట్రల్ లైటింగ్

అధ్వానంగా ఆనందపురం

● ఎక్కడ చూసినా చెత్త

● మురుగుతో నిండిన కాలువలు

7 లో

పేరులో ఉన్న సిరి..

ఊరిలో ఏది?

● వర్షం కురిస్తే గ్రామమంతా చిత్తడే

● కానరాని కాలువలు, రోడ్లు ● అవస్థలు పడుతున్న

● సిరిపురం గ్రామ ప్రజలు

7 లో

నాగావళి వరద తగ్గుముఖం 8 లో

రహదారి మధ్యలో నిలిచిన వాహనాలు 8 లో

కార్మిక హక్కులను కాపాడుకుంటాం

● సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు

● కార్మికులను ఉత్తేజపరిచిన సినీనటుడు ఆర్.నారాయణమూర్తి ● ముగిసిన జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న ఆర్.నారాయణమూర్తి

పాలకొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని, పోరాటాలతోనే వాటిని కాపాడుకుంటామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. పట్టణంలో రెండు రోజుల పాటు జరిగిన సీఐటీయూ మహాసభలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు సినీ నటుడు, నిర్మాత, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ.. కార్మికులు, ఉద్యోగులు, అధికారులపై రాజకీయ వేధింపులు పెరిగాయన్నారు. ఈ విషయంలో నూతన ప్రభుత్వంలో కూడా ఎటువంటి మార్పులు లేవని అన్నారు. కార్మికుల పోరాటాలను అణిచివేసే కుట్రలను మానుకోవాలన్నారు. విశాఖపట్నం కేంద్రంగా డిసెంబరు 31 నుంచి వారం రోజుల పాటు జాతీయ మహాసభలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ.. కార్మిక రంగం సమరశీల పోరాటాలతో పాటు నిర్మాణ కార్యాచరణపై దృష్టిసారించాలని అన్నారు. అనంతరం ఆర్.నారాయణమూర్తి పాటలు పాడి కార్మికులను ఉత్తేజపరిచారు. మహాసభల సందర్భంగా 47 మంది సభ్యులతో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.రమణారావు, ప్రధాన కార్యదర్శిగా వై.మన్మథరావు, కోశాధికారిగా గొర్లె వెంకటరమణ, కార్యదర్శులుగా బీవీ రమణ, ఎస్.వై.నాయుడు, ఎం.ఉమామహేశ్వరి, రామలక్ష్మి, జ్యోతిలక్ష్మి, శాంతికుమారి, రెడ్డి వేణు ఎన్నికయ్యారు.

నిరుపయోగంగా కేజ్ కల్చర్

● ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు

● కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



పెద్దగెడ్డ జలాశయంలో నిరుపయోగంగా ఉన్న కేజ్ కల్చర్

పాచిపెంట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పాచిపెంట సమీపంలోని పెద్దగెడ్డ జలాశయంలో ఏర్పాటు చేసిన కేజ్ కల్చర్ నిరుపయోగంగా మారింది. గత ఆరేళ్లుగా దానిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా గత టీడీపీ ప్రభుత్వం పెద్దగెడ్డ జలాశయంలో ఆస్ట్రేలియా సాంకేతిక పరిజ్ఞానంతో కేజ్ కల్చర్ ఏర్పాటు చేసింది. 2006లో గుజరాత్ నుంచి తిలాపియా చేప పిల్లలు తెప్పించి పెంపకం చేపట్టారు. ఇందుకోసం మత్స్యశాఖ ద్వారా సుమారు రూ. 35 లక్షలు వెచ్చించారు. పెరిగిన చేపలను మత్స్యకారులు సులభంగా పట్టుకునే వారు. వారి జీవనోపాధికి ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదు. మత్స్యకారులు రూ.500 చెల్లిస్తే టీడీపీ ప్రభుత్వం ఒక్కొక్కరికి సైకిల్, వల మంజూరు చేసింది. అయితే 2019 తరువాత ప్రభుత్వం మారడంతో సీన్ మారిపోయింది. వైసీపీ సర్కార్ కేజ్ కల్చర్ నిర్వహణ గాలికొదిలేసింది. దీంతో తిలాపియా చేపల పెంపకానికి మంగళం పాడింది. ఫలితంగా మత్స్యకారులు ఉపాధికి దూరమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంపై మత్స్యకార సంఘ సభ్యులు ఆశలు పెట్టుకున్నారు. జలాశయానికి సంబంధించి శ్రీపెద్దగెడ్డ గిరిజన స్వదేశీ మత్స్యకార సంఘంలో 164 మంది సభ్యులు ఉన్నారు. టీడీపీ హయాంలో కేజ్ కల్చర్ ఏర్పాటయిందని, దీని నిర్వహణపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని నమ్మకం సంఘ సభ్యుల్లో దృఢంగా ఉంది. కేజ్ కల్చర్‌పై దృష్టి సారించి మళ్లీ చేప పిల్లల పెంపకాన్ని పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.

ఉపాధి కోల్పోయాం..

కేజ్ కల్చర్ నిరుపయోగంగా ఉంది. దీంతో గత ఆరేళ్లుగా ఉపాధి అవకాశాలు కోల్పోయాం. తగిన సౌకర్యాలు లేకపోవడంతో వేటకు వెళ్లాలంటే భయంగా ఉంది. గతంలో లైఫ్ జాకెట్లు లేక ముగ్గురు మత్స్యకారులు చేపలు పడుతుండగా జలాశయంలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందారు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి కేజ్ కల్చర్‌ను వినియోగంలోకి తీసుకురావాలి.

-బచ్చుల జోగిరాజు, మడవలస, మత్స్యకార సంఘం అధ్యక్షుడు

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) నిర్వహిస్తామని, అన్ని శాఖ అధికారులు అందుబాటులో ఉంటారని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సేవలను అర్జీదారులు వినియోగించుకోవాలని కోరారు. అలాగే అర్జీదారులు మీ కోసం కాల్ సెంటర్ సేవలను 1100 వినియోగించుకోవాలన్నారు.

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

గంట్యాడ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమం సోమవారం నుంచి వచ్చే నెల 15 తేదీ వరకూ నిర్వహిస్తామని పశు సంవర్ధక శాఖ ఏడీ డా.రెడ్డి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మూడు బృందాలుగా ఏర్పడి ప్రతి గ్రామానికి ఆయా తేదీల్లో టీకాలు వేస్తారని చెప్పారు. రైతులందరూ ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు.

వారం రోజుల్లో 1500 మెట్రిక్ టన్నుల యూరియా

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రానున్న వారం రోజుల్లో 1000 నుంచి 1500 మెట్రిక్ టన్నులు యూరియా జిల్లాకు రానున్నదని వ్యవసాయ శాఖ ఇన్‌చార్జీ జేడీ భారతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో జిల్లా అవసరాలు తీరనున్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. జిల్లాలో ఆదివారం 933 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశారని ఆమె చెప్పారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

రాజాం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావును కోరారు. ఆదివారం రాజాం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేని కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన తోపాటు ఏపీటీఎఫ్ విజయనగరం జిల్లా ఉపాధ్యక్షుడు లంక రామకృష్ణ, జిల్లా కార్యదర్శి వై.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

సంతకవిటి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మన గ్రోమోర్ దుకాణంలో యూరియా అమ్మకాలపై విజిలెన్స్ అధికారులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్‌ఐ ఆశోక చక్రవర్తి ఆధ్వర్యంలో కోరమాండల్ ఫెర్టిలైజర్‌లో తనిఖీలు చేశారు. మండలంలో ఎక్కడెక్కడ యూరియా నిల్వలు ఉన్నాయని ఏవో యశ్వంత్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు ఇంజనీర్ గణేష్, సిబ్బంది ఉన్నారు.

దుర్గమ్మతల్లి పండుగకు పందిరిరాట



పందిరిరాట వేస్తున్న దృశ్యం

జామి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అన్నంరాజుపేట గ్రామంలో ఆదివారం దసరా మహోత్సవాలు పురస్కరించుకుని దుర్గమ్మ తల్లి పూజలకు గ్రామస్థులంతా కలిపి పందిరిరాట వేశారు. ఈ కార్యక్రమంలో అన్నంరాజుపేట పీఏసీఎస్ అధ్యక్షుడు ఎన్నింటి అప్పలరాజు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా తమ గ్రామంలో దసర పండుగ వైభవంగా చేసుకుంటామని తెలిపారు.

కేంద్ర మంత్రిని కలిసిన హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడును సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడిని రాష్ట్ర హోటల్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు శ్రీకాకుళంలోని ఆయన నివాసంలో ఆదివారం కలిశారు. ఈనెల 18 నుంచి 20 వరకూ బెంగుళూరులో జరిగే జాతీయ స్థాయి ఎఫ్‌ఆర్‌హెచ్‌ఏ సమావేశానికి హాజరు కావాలని ఆహ్వానించారు. ఈసందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, భవిష్యత్తులో మరింత ఉన్నతంగా తయారుకావాలని రాష్ట్ర ప్రభుత్వం ఆశయాలను అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మెట్టా నాగరాజు, బి.శ్రీనివాస్, వినోద్, ఆనంద్ పాల్గొన్నారు.

అధ్వానంగా ఆనందపురం

- ఎక్కడ చూసినా చెత్త
- మురుగుతో నిండిన కాలువలు



రోడ్డుపైన నిల్వ ఉన్న మురుగు

గుర్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆనందపురం గ్రామంలో పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా తయారయ్యింది. వీధుల్లోని కాలువలన్నీ మురుగుతో నిండిపోయాయి. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడే సమయంలో ఇళ్ల ముందే నీరు నిలిచిపోయి, దుర్వాసన వెదజల్లుతోందని వాపోతున్నారు. వ్యాధులు ప్రబలితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. అలాగే గ్రామంలోని శివాలయం చుట్టుపక్కల మురుగునీరు నిలిచి భక్తులకు అసౌకర్యం కలిగిస్తోంది. విద్యార్థులు బస్‌స్టాప్ వద్దకు చేరుకోవాలంటే ప్రతిరోజూ మురుగు నీటిలో నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది.



గ్రామంలో మురుగుతో నిండిన కాలువ

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం

గ్రామంలో రోడ్లు, వీధి కాలువలు సక్రమంగా లేవు. గతంలో నిర్మించిన కాలువలు వెడల్పు తక్కువగా ఉండడం వల్ల ఎప్పటికప్పుడే మురుగు నిండిపోతుంది. నూతనంగా కాలువలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

- బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, ఆనందపురం

పేరులో ఉన్న సిరి.. ఊరిలో ఏది?

- వర్షం కురిస్తే గ్రామమంతా చిత్తడే
- కానరాని కాలువలు, రోడ్లు
- అవస్థలు పడుతున్న సిరిపురం గ్రామ ప్రజలు

గంట్యాడ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అది గిరిజన గ్రామం కాదు.. మారుమూల గ్రామం అంతకంటే కాదు. జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్లు, మండల కేంద్రానికి మూడు కిలో మీటర్లు దూరంలో ఉన్న ఈ గ్రామం అభివృద్ధికి మాత్రం ఆమడ దూరంలో ఉంది. ఇదే సిరిపురం గ్రామం. ఈ గ్రామంలో సరైన రోడ్లు లేవు. కాలువలు లేవు. గత కొన్ని సంవత్సరాలుగా గ్రామంలో సీసీ రోడ్లు గానీ, డ్రైనేజీ కాలువలు గానీ నిర్మించే పరిస్థితి కనిపించలేదు. చిన్న వర్షం కురిసినా గ్రామంతా చిత్తడి చిత్తడిగా మారిపోతుంది. దీంతో గ్రామ ప్రజలు అవస్థలు పడుతున్నారు.

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాలకు సీసీ రోడ్లు, కాలువలు మంజూరైనా సిరిపురం గ్రామానికి ఏ పనీ మంజూరు కాలేదు. దీనికి గ్రామంలోని నాయకుల మధ్య సమన్వయం లోపమే కారణంగా తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామానికి రోడ్లు, కాలవులు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



సిరిపురం గ్రామంలో చిత్తడిగా ఉన్న రోడ్డు

అమరావతి రైతుల్లా చూడండి

- జిందాల్ నిర్వాసితుల ధర్నా

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు తమను కూడా అమరావతి రైతుల్లా చూడాలని జిందాల్ నిర్వాసితులు కోరారు. తమ భూములు తమకు ఇప్పించాలని కోరుతూ వారు బొడ్డవర గ్రామంలో గత 85 రోజులుగా శాంతియుత పోరాటం చేస్తున్నారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ మాట్లాడారు. గత ప్రభుత్వం జీవో నెంబర్-14 ఇచ్చిందని ఈ జీవోతో జిందాల్ యాజమాన్యం ఇక్కడ రియల్‌ఎస్టేట్ వ్యాపారానికి తెర లేపుతుందన్నారు. వెంటనే రైతుల భూములు రైతులకు ఇప్పించి తిరిగి ప్రభుత్వమే ఈ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుచేసి, ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

నిరాధార ఆరోపణలు తగవు



సాక్షి పత్రికను తగులబెడుతున్న టీడీపీ శ్రేణులు

రాజాం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ స్థానికంగా ఉండడం లేదని.. ఆయన సోదరుడు అన్నీ చక్కబెడుతున్నారంటూ ఆరోపిస్తూ ఇటీవల సాక్షి మీడియాలో వచ్చిన కథనాలపై టీడీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశాయి. ఆదివారం రాజాం పట్టణంలో వారంతా మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం సాక్షి పత్రికను దహనం చేశారు. సంతకవిటి మాజీ ఎంపీపీ కొల్ల అప్పలనాయుడు, వంగర మాజీ ఎంపీపీ బొత్స వాసుదేవరావు నాయుడు తదితరులు మాట్లాడుతూ నిరాధార ఆరోపణలు తగవన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గజపతినగరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో పుష్పలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి మండల శాఖ అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు.

గణపతి ఉత్సవాలతో జాతీయ సమైక్యత

- మంత్రి శ్రీనివాస్
- కొండపేటలో ఘనంగా గణేష్ నిమజ్జనం



ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్ తదితరులు

నెల్లిమర్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గణపతి ఉత్సవాలు జాతీయ సమైక్యతకు దోహదపడతాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని తూర్పు మహారాజు పేట (కొండపేట)లో గణేష్ నిమజ్జన ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గత 91 సంవత్సరాలుగా ఈ గ్రామంలో గణపతి ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఊరేగింపులో సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కమిటీ ప్రతినిధులు అల్తి శ్రీనివాసరావు, నడిపేన నారాయణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, టీడీపీ నాయకులు సువ్వాడ రవిశేఖర్, కడగల ఆనంద్‌కుమార్, గేదెల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

గురజాడ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలి



ప్రతులను చూపిస్తున్న వేదిక ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మహాకవి గురజాడ అప్పారావు 163వ జయంతిని ఈనెల 21న రాష్ట్ర పండుగగా నిర్వహించాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఆదివారం స్థానిక గురజాడ గృహంలో ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబరు689 ప్రకారం 22 మంది ప్రముఖుల జయంతి, వర్ధంతులను రాష్ట్ర పండుగగా నిర్వహి స్తామని ప్రకటించిందని, అందులో మహాకవి గురజాడ అప్పారావు పేరు లేక పోవడం గురజాడ సాహిత్య అభిమానులు, ఉత్తరాంధ్ర ప్రజలు బాధపడ్డారన్నారు. ఈనెల 18న జరిగే అసెంబ్లీ సమావేశాల్లో జిల్లా ఎమ్మెల్యేలు.. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లి, రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రొంగలి పోతన్న, డా.వెంకటేశ్వరరావు, దవళ సర్వేశ్వరరావు, దవడ కొండబాబు, గురజాడ ఇందిర, వెంకటేశ్ ప్రసాద్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఎన్నిక



వేదికపై జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు

విజయనగరం రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జనవిజ్ఞాన వేదిక 18వ రాష్ట్ర మహాసభలు ఆదివారం ఘనంగా ముగిశాయి. జడ్పీ సమావేశ భవనం వేదికగా జరిగిన ఈ ఉత్సవాలు ఉత్సాహంగా సాగాయి. చివరి రోజు పది తీర్మానాలను ఆమోదించారు. నూతన కమిటీని 75 మందితో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కేఎస్ లక్ష్మణరావు, పి.సురేష్, కోశాధికారిగా జి.మురళీధర్‌లు ఎన్నికయ్యారు. వీరితో పాటు కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, సబ్ కమిటీ కన్వీనర్లుగా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

సిరియేలపేట రోడ్డుకు మోక్షమెప్పుడో?

- కొన్నేళ్లగా ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు

మెరకముడిదాం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మెరకముడిదాం మండలం కొర్లాం పంచాయతీ మధుర గ్రామమైన సిరియేలపేట రోడ్డు పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. గత కొన్ని సంవత్సరాల నుంచి రోడ్డు పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. రోడ్ల అభివృద్ధికి ప్రతిఏటా ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించినప్పటికీ ఈ రోడ్డును పట్టించుకున్న నాథుడు కరువయ్యాడు. ఈ రోడ్డు నాలుగు గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరం. అయినప్పటికీ ఇటు అధికారులు గానీ అటు ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇక్కట్లుకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



గోతులమయంగా సిరియేలపేట వెళ్లే రోడ్డు

గజపతినగరం రైల్వేస్టేషన్‌కు కొత్త రూపు

- ప్రయాణికులకు తగ్గట్టుగా మౌలిక వసతుల కల్పన

గజపతినగరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం రైల్వే స్టేషన్ కొత్త రూపు దిద్దుకుంటోంది. ప్రస్తుతం కోట్లాది రూపాయలతో ఆధునీకీకరణ పనులు చేపడుతున్నారు. మూడో రైల్వేలైన్ రావడంతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నాలుగు ప్లాట్‌పామ్‌లకు అనుగుణంగా పనులు చేపడుతున్నారు. ఇందుకు అవసరమైన బ్రిడ్జి పనులు చేస్తున్నారు. అలాగే జాతీయ రహదారి నుంచి నేరుగా రైల్వేస్టేషన్‌కు ప్రయాణికులు చేరుకునేలా స్థల సేకరణ చేపట్టి నాలుగు రోడ్ల విస్తరణ చేపట్టారు. జాతీయ రహదారి నుంచి నేరుగా రైల్వేస్టేషన్‌కు వచ్చే విధంగా రోడ్డు వేశారు. గతంలో రైల్వేస్టేషన్‌లో రెండు లైన్లు ఉండగా ప్రస్తుతం నాలుగు లైన్లుగా విస్తరించారు. ఉద్యోగులు విశ్రాంతి తీసుకోవడంతో పాటు వారి కుటుంబ సభ్యులు, పిల్లలకు అనుకూలంగా ఉండే విధంగా ఇప్పటికే పార్కును ఏర్పాటుచేశారు. నియోజకవర్గ మండల కేంద్రమైన గజపతినగరం రైల్వేస్టేషన్‌కు గజపతినగరం, బొండపల్లి, మెంటాడ మండలాలకు చెందిన సుమారు 130 గ్రామాలకు చెందిన ప్రజలు ఇక్కడ రైల్వేస్టేషన్‌కు వచ్చి పలు ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మేరకు ప్రతి ప్లాట్‌ఫాంపై కుర్చీలు, ఫ్యాన్లు, తాగునీటి కొళాయిలు వంటివి ఏర్పాటు చేస్తున్నారు.

ఎక్స్‌ప్రెస్ హాల్టు కల్పించాలి

గజపతినగరం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ ప్రతిరోజూ అధికంగానే ఉంటుంది. తిరుపతి, ఢిల్లీ, చెన్నై వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు విజయనగరం గానీ, విశాఖపట్నం గానీ వెళ్లి అక్కడ రైలును ఆశ్రయించాల్సి వస్తోంది. గజపతినగరం స్టేషన్ మీదుగా 8 ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. ఇందులో ఒక్క నాగావళి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మాత్రమే హాల్ట్ కల్పించారు. మిగిలిన ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టు కల్పించాలని నియోజకవర్గ ప్రజలు.. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు వినతులు ఇచ్చారు.



గజపతినగరం రైల్వేస్టేషన్‌లో నూతనంగా చేపడుతున్న బ్రిడ్జి నిర్మాణం

పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్య

సీతానగరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వెంకటాపురం సమీపంలో వి.రాము(33) అనే వ్యక్తి ఆదివారం మధ్యాహ్నం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బొబ్బిలి మండలం శివడవలస గ్రామానికి చెందిన రాము.. సీతానగరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ధనలక్ష్మిని కొన్నేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. అయితే వారి మధ్య ఈ మధ్యకాలంలో గొడవ జరుగుతుండేవి. దీంతో మనస్తాపానికి గురైన రాము ఆదివారం మధ్యాహ్న సమయంలో పురుగు మందు తాగాడు. విషయం గమనించిన స్థానికులు పార్వతీపురంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ రాము చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి లక్ష్ము ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజేష్ కేసు నమోదు చేశారు.

మద్యానికి బానిసై ఒకరు..

సాలూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారమ్మ కాలనీ గొడగల వీధికి చెందిన జలుమూరు సాయి(34) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. మద్యానికి బానిసైన సాయి భార్యా పిల్లలకు దూరంగా ఉంటున్నాడు. మద్యం తాగడం వల్ల అనారోగ్యం పాలవ్వడంతో పాటు మనస్తాపానికి గురయ్యాడు. దీంతో ఆదివారం ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుడికి భార్య ప్రేమలత, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై పట్టణ ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో తాపీమేస్త్రీ మృతి

మక్కువ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో తాపీమేస్త్రీ మృతి చెందిన ఘటన మక్కువ మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఎం.పాలికవలస గ్రామానికి పాల గౌరు(39) తాపీమేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో మక్కువ బీసీ కాలనీకి చెందిన మామిడి ఆనందరావు ఇంటి నిర్మాణానికి కాంట్రాక్టు తీసుకున్నాడు. ఆదివారం ఆనందరావు ఇంటి శ్లాబ్‌ను పరిశీలించేందుకు గౌరు మేడపైకి వెళ్లాడు. పరిశీలన అనంతరం కిందకు దిగుతుండగా ఇంటి పక్కనే వేలాడుతున్న హెచ్‌టీ లైన్ అతడికి తగిలింది. దాంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య పైడితల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మక్కువ ఎస్‌ఐ ఎం.వెంకటరమణమూర్తి కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని ఒకరు..

దత్తిరాజేరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమానాపురం టోల్‌ప్లాజా వద్ద లారీ ఢీకొని హిజ్రా మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మానాపురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెదమానాపురం టోల్‌ప్లాజా వద్ద ఒక హిజ్రా నడుచుకుంటూ వెళ్తుండగా.. రామభద్రపురం వైపు నుంచి విజయనగరం వైపు వెళ్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో హిజ్రా తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ఆర్.జయంతి తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్

- ముగ్గురికి గాయాలు

సంతకవిటి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజాం-పాలకొండ ప్రధాన రహదారిపై పొనుగుటివలస పరిధిలోని జీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెయిన్ గేట్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయాల పాలయ్యారు. ఈ ఘటనపై ఏఎస్‌ఐ ఎం.వాసుదేవరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేగిడి ఆమదాలవలస మండలం ఆడవరం గ్రామానికి చెందిన బంకి రమణమ్మ తన భర్త సింహాచలంతో కలిసి అదే గ్రామం నుంచి మనుమరాలు రితికను తీసుకుని చీపురుపల్లిలోని తన కుమార్తె ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. జీఎంఆర్ గేట్ సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. పక్క వీధిలోకి తిప్పే క్రమంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. బంకి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ తెలిపారు.

మూడు తులాల బంగారం చోరీ

కొత్తవలస, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): దేశపాత్రునిపాలెం పంచాయతీ శివారు శీరం శెట్టివానిపాలెం గ్రామంలోని ఒక ఇంటిలోకి శనివారం అర్ధరాత్రి దుండగులు చొరబడి సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.24 వేల నగదు దోచుకున్నారు. కంటకాపల్లి పంచాయతీలోని శారదా కర్మాగారంలో పనిచేస్తున్న మీసాల రవి ప్రకాష్ అనే వ్యక్తి దేశపాత్రునిపాలెం వద్ద డెక్కన్ ఫెర్రోఅల్లాయిస్ కర్మాగారం సమీపంలోనున్న శీరంశెట్టివానిపాలెం గ్రామానికి కొద్ది దూరంలో ఓ ఇంట్లో నివాసం ఉంటున్నారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఇంటికి ఒక వ్యక్తి ముందుగా వెళ్లి తలుపుకొట్టాడు. దీంతో రవిప్రకాష్ మామయ్య రాము తలుపు తీసి చూడగా.. ఆ వ్యక్తి బెదిరించి లోపలికి చొరబడ్డాడు. ఆ వెంటనే మరో ఐదుగురు వ్యక్తులు ఇంట్లోకి వెళ్లి రవిప్రకాష్ భార్య సత్యవతిని, మిగిలిన కుటుంబ సభ్యులను బెదిరించారు. మూడు తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.24వేల నగదును దోచుకున్నారు. అందిన సమచారం మేరకు ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు, కొత్తవలస ఎస్‌ఐ జోగారావు ఘటనా స్థలానికి వెళ్లి, పరిశీలించారు. విజయనగరం నుంచి క్లూస్ టీం వచ్చి వేలిముద్రలను సేకరించింది. రవిప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేయగా, ఎస్‌ఐ దర్యాప్తు చేస్తున్నారు.

సాగునీటి కాలువల్లో కోళ్ల వ్యర్థాలు

- ఇబ్బంది పడుతున్న రైతులు
- చోద్యం చూస్తున్న అధికారులు



పొలాల్లో పడేసిన కోళ్ల వ్యర్థాలు

గుర్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కోళ్లఫారం వ్యర్థాలను విచ్చలవిడిగా పొలాల్లోనూ, సాగునీటి కాలువల్లో పారబోస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. గుజ్జింగివలస గ్రామంలోని చోడవరం రెవెన్యూ పరిధిలో గల ఆయకట్టుకు సాగునీరు అందించే కాలువల్లో, పంట పొలాల సమీపంలో కోళ్ల వ్యర్థాలను రాత్రి వేళల్లో రహస్యంగా తీసుకువచ్చి డంప్ చేస్తున్నారు. దీంతో పంట కాలువ నుంచి పొలాల్లోకి వెళ్లే నీరు కలుషితమై పంటల సాగుకు అంతరాయం కలుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే దుర్వాసనతో ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. కోళ్లఫారం వ్యర్థాలను పొలాల్లోకి, గుంతల్లోకి తరలిస్తున్నారని చెప్పారు. దీంతో కాలువల వద్ద గుంతలు ఆనుకుని ఉన్న పొలాల్లోనూ, సాగునీటి వనరులు, భూగర్భ జలాలు, పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఈపీఎఫ్ పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఈపీఎఫ్ పెన్షన్‌దారుల సంఘం నాయకులు

నెల్లిమర్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఈపీఎఫ్ కనీసం పెన్షన్ రూ.9వేలు పోరాటంతో సాధించుకోవాలని ఈపీఎఫ్ పెన్షన్‌దారుల సంఘం జిల్లా కార్యదర్శి ఓఎస్ఎన్.మూర్తి, కోశాధికారి అంబళ్ల గౌరినాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అమర కార్మికుల భవనంలో ఈపీఎఫ్ పెన్షన్‌దారుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వారు మాట్లాడారు. ఈపీఎఫ్ పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈపీఎఫ్ పెన్షన్‌దారుల సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు, మోయిద పాపారావు, కాళ్ల అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

కొండలపై అక్రమార్కుల కన్ను

(ఐదో పేజీ తరువాయి)

తవ్వకాలు చేపడుతున్నట్లు గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి జిల్లా అటవీ శాఖ అధికారి లక్ష్మణ్ పూర్తి ఆధారాలతో హైకోర్టుకు సమర్పించారు. దీంతో ఆ ప్రాం తంలో వెంటనే తవ్వకాలు నిలిపివేయాలని హైకోర్టు ఆదేశించింది. దీనిపై కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయించి రిజర్వ్ ఫారెస్ట్ ఆఫ్ ఇండియా సర్వే బృందంతో ఆ ప్రాంతాన్ని సర్వే చేయాలని కోరారు. కోర్టు ఆదేశాల మేరకు సర్వే చేపట్టిన బృందం ఆ ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్‌లో లేదని కోర్టుకు నివేదిక ఇచ్చింది. ఈ నివేదిక ఆధారంగా చేసుకొని, స్థానిక అటవీశాఖాధికారులను సం ప్రదించిన అనంతరం వారి ఆమోదంతోనే గ్రానైట్ తవ్వకాలు చేపట్టాలని కాంట్రాక్టర్లను హైకోర్టు ఆదేశించింది. కానీ, కాంట్రాక్టర్లు మాత్రం అటవీశాఖ అనుమతులు లేకుండానే ఆ ప్రాంతంలో గ్రానైట్ తవ్వకాలు ప్రారంభించారు. నూటికి నూరు శాతం ఆ ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్నట్టు ఒకప్పుడు అటవీశాఖ నిరూపించింది. ఇప్పుడు మరోసారి కోర్టును ఆశ్రయించి గ్రానైట్ తవ్వకాలను అడ్డుకోవాల్సి ఉన్నా ఎందుకనో అటవీశాఖ వెనుకడుగు వేస్తుంది. ఈ అంశంపై కలెక్టర్ పూర్తిస్థాయిలో దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

అధ్వానంగా రహదారులు

●పట్టించుకోని పాలకులు ●గిరిజనులకు తప్పని ఇక్కట్లు

మక్కువ రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గిరిజన గ్రామాల రహదారులు అధ్వానంగా ఉన్నాయి. దీంతో గిరిజనులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో వారి కష్టాలు వర్ణనాతీతం. మక్కువ మేజరు పంచాయతీలోని కీలకమైన అంటివలస రోడ్డు పూర్తిగా రూపుకోల్పోయింది. ఎన్ని ప్రభుత్వాలు మారినా శంబర రోడ్డు నుంచి అంటివలస వరకూ ఉన్న రెండు కిలోమీటర్ల రోడ్డు పరిస్థితి మాత్రం మారడంలేదు. వైసీపీ హయాంలో రూ.60 లక్ష వ్యయంతో ఐటీడీఏ ద్వారా పనులు చేపడతామంటూ అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేశారే తప్ప పనులు జరగలేదని స్థానికులు అంటున్నారు. మార్కొండపుట్టి పంచాయతీ కేంద్రుకష్మిశిల గ్రామానికి చెందిన రోడ్డుదీ అదే పరిస్థితి. నంద రోడ్డు జంక్షన్ నుంచి కేంద్రుకష్మిశిల వరకూ కిలోమీటరు దూరం రోడ్డు నిర్మాణం చేపట్టక పోవడంతో గిరిజనులు రాకపోకలకు అష్టకష్టాలు పడుతున్నారు. పాలకులు స్పందించకపోవడంతో స్థానికులు చందాలు వేసుకుని రోడ్డును బాగు చేసుకున్నారు.

●అంటివలస రోడ్డు విషయమై పార్వతీపురం ఐటీడీపీ ఏఈ పి.వి.సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా.. రోడ్డు నిర్మాణానికి ఎటువంటి నిధులు మంజూరు కాలేదని తెలిపారు. వైసీసీ ప్రభుత్వం రూ. 60 లక్షలతో తారు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించినా నిధులు మంజూరు కాలేదన్నారు. ఆ ప్రతిపాదనలు రద్దయ్యాయని ఏఈ తెలిపారు.



బురదమయంగా అంటివలస రోడ్డు



రోడ్డు బాగుచేసుకుంటున్న కేంద్రుకష్మిశిల గ్రామస్థులు (ఫైల్)

టీడీపీ నాయకుడిపై వైసీపీ కార్యకర్త దాడి

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రధాన రహదారిలోని ఓ టీ దుకాణం వద్ద ఆదివారం రాత్రి టీడీపీ నాయకుడిపై వైసీపీ కార్యకర్త దాడికి పాల్పడ్డాడు. ఏరియా ఆసుపత్రి ఔట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టీ దుకాణం వద్ద టీడీపీ యువజన విభాగం అధ్యక్షుడు పాలకొండ రాజశేఖర్ ఉండగా వైసీపీకి చెందిన ఓ కార్యకర్త వాగ్వాదానికి దిగాడు. ఆ తర్వాత రాజశేఖర్‌పై కర్రతో దాడికి పాల్పడ్డాడు. దాంతో రాజశేకర్ చికిత్స కోసం పార్వతీపురం ఆసుపత్రి వెళ్లారు. అక్కడి ఔట్ పోస్టు పోలీసులు రాజశేఖర్ నుంచి ఫిర్యాదు స్వీకరించారు.

డంపింగ్‌యార్డు తొలగించండి

పాలకొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ నుంచి సేకరించిన చెత్తాచెదారాలను మండలంలోని ఓని గ్రామానికి వెళ్లే రహదారి పక్కనే బత్తులవాని చెరువులో డంపింగ్ చేయడాన్ని ఆ గ్రామ ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఆదివారం డంపింగ్ చేసే ప్రాంతం వద వారు ఆందోళన చేశారు. పాలకొండ, ఓని గ్రామాల మధ్య బత్తులవానిచెరువు గట్టుపైనే చెత్తాచెదారాలు వేయడంతో దుర్వాసన వెదజల్లుతోందని, ఇబ్బందులకు గురవుతున్నామని అభ్యంతరం వ్యక్తం చేశారు. కొన్ని నెలలుగా ఈ చెరువులో నగర పంచాయతీ పారిశుధ్య సిబ్బంది డంపింగ్ చేస్తున్నప్పటికీ ఇటీవల కాలంలో ఏకంగా ప్రధాన రహదారి పక్కనే వ్యర్థాలను వేస్తున్నారని వారు ఆరోపించారు. నగర పంచాయతీ అధికారులు స్పందించి డంపింగ్‌యార్డును బత్తులవానిచెరువు నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో కనపాక అప్పలనాయుడు, ధనుంజయ, కార్తీక్, సాయి, అనికేత్, లాభాల వికాస్ ఉన్నారు.



ఆందోళన చేస్తున్న ఓని గ్రామస్థులు

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

బొబ్బిలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వానికి నివేదించాలని, అసెంబ్లీలో ప్రస్తా వించి వాటిని పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు ఆదివారం బొబ్బిలిలో ఎమ్మెల్యే బేబీనాయన ఏపీటీఎఫ్ అకడమిక్ రాష్ట్ర కన్వీనరు జేసీ రాజు నాయకత్వంలో ఆ సంఘం నాయకులు కలుసుకొని వినతిపత్రం అందజేశారు. ఈ డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు సీహెచ్‌జే ప్రవీణ్‌కుమార్, జీసీహెచ్‌జీ శర్మ, నాగూరు రమేష్, మన్మథరావు, అప్పారావు, చెంచునాయుడు, ఆర్ఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మల్లమ్మ చెరువుకు గండి

బొబ్బిలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ పరిధి లోని మల్లమ్మపేటకు చెందిన మల్లమ్మ చెరువుకు గండిపడింది. చెరువుగట్టు బల హీనపడడంతో గండి పడిందని రైతులు పోల జగన్, వెంకటరమణ, పెంట రమణ, కర్రి అప్పలనాయుడు తెలిపారు. ఈచెరువు కింద సుమారు వందెకరాల ఆయకట్టు సాగవుతోంది. ప్రస్తుతం వరి పంట ఇక్కడ పొట్టదశలో ఉంది. ఈనేపథ్యంలో చెరువుకు గండిపడడంతో పంట నీటముంపునకు గురయ్యిందని రైతులు తెలిపారు. వరి పంటకు నష్టం కలగకుండా ఉండేందుకు ఇసుక బస్తాలతో తాత్కాలికంగా గండిని రైతులు శ్రమదానం చేసి పూడ్చారు. ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి మల్లమ్మ చెరువు గండిని శాశ్వతంగా పూడ్చాలని రైతులు పేర్కొన్నారు. దశాబ్దాల కిందట నిర్మించిన మదుము కావడంతో ఏటా వర్షాకాలంలో ఇబ్బందిపడుతున్నామన్నారు. ఇరిగేషన్ కాలువకు అనుసంధానంగా మల్లమ్మపేటలో కొత్తచెరువు, తమ్మినాయుడు, మల్లమ్మచెరువులు ఉన్నాయని, వాటి మదుముల వ్యవస్థ, గట్లను పటిష్ఠపరచాలని రైతులు డిమాండ్‌చేస్తున్నారు.



మల్లమ్మ చెరువుకు గండిపడిన దృశ్యం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

పార్వతీపురం రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలం కె.వెంకటాపురానికి చెందిన బుడితి సింహాచలంకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.95,837 మంజూరయ్యాయి. ఆదివారం మండలంలోని వెంకంపేటలోని టీడీపీ కార్యాలయంలో సంబంధిత చెక్కును ఎమ్మెల్యే ఎమ్మెల్యే విజయచంద్ర బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

ఘనంగా భాను సప్తమి పూజలు

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని సూర్యపీఠంలో ఆదివారం భాను సప్తమి పూజలను ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి వేమకోటి నరహరశాస్త్రి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి సూర్యపీఠంలో స్వామివారికి వేదపండితులు వేదమంత్రాల నడుమ సప్త సూర్య నమస్కారాలు, తృచసౌరారుణ పారాయణాలు, నారాయణ, విష్ణు సూక్తాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నాటక, పద్యగాన కళలో గుర్తింపు పొందిన సూర్యపీఠ ఆస్థాన గాయకుడు భాస్కరభట్ల సత్యప్రసాద్ శర్మను నరహరశాస్త్రి, పండితులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సూర్యపీఠం పండితులు వి.వివేకానంద శర్మ, నీలకంఠశర్మ, ఉమాశర్మ తదితరులు పాల్గొన్నారు.



సత్యప్రసాద్ శర్మను సత్కరిస్తున్న నరహరశాస్త్రి

భక్తిశ్రద్ధలతో వారాల పండుగ

మక్కువ, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం దేశమ్మతల్లి వారాల పండుగను ఘనంగా నిర్వహించారు. స్థానిక జన్నివీధిలోని అమ్మవారి గద్దెపైన ఘటాలతో పూజారి కృష్ణమూర్తి వీధుల్లో ఊరేగారు. మేళతాళాలు, డప్పులు, కళాకారుల ప్రదర్శనలతో ఘటాల ఊరేగింపు జరిగింది. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ప్రధన రోడ్డు మీదుగా ఊరేగింపుగా వెళ్లి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని అమ్మవారి గద్దె వద్దకు ఘటాలను చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ ఎం.వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



మక్కువలో ఘటాల ఊరేగింపు

●గరుగుబిల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం కలగొప్పులు పండుగను రైతులు ఘనంగా నిర్వహించారు. ఖరీఫ్‌లో వరి ఉభాలు తదుపరి పంట పొలాల్లో చీడపీడలు ఆశించకుండా పంటలు దిగుబడులు అధికంగా వచ్చేలా గ్రామస్థాయిలో విజయ దశమికి ముందు ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది ప్రత్యేక పూజల అనంతరం వివిధ రకాల పదార్థాలను పంట పొలాల్లో వెద జల్లారు. గ్రామ దేవతల ఆశీస్సులు పొందారు.

పాతబొబ్బిలిలో దేశమ్మ ప్రభల ఊరేగింపు

●బొబ్బిలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని పాతబొబ్బిలి లో ఆదివారం దేశమ్మ వారాల పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్దలు, మహిళలు, భక్తులు అమ్మవారి ఆలయంలో మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ప్రభల ఊరేగింపు ఆకట్టుకుంది. కార్యక్రమంలో గ్రామపెద్దలు చోడిగంజి రమేష్‌నాయుడు, కోట పెదరాములు, ఏఎంసీ డైరెక్టర్ మింది రమాదేవిరామకృష్ణ పాల్గొన్నారు. అలాగే.. మండలంలోని ముత్తావలసలో దేశమ్మ అమ్మవారి వారాల పండుగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, పసుపు కుంకుమలతో మొక్కులు చెల్లించారు. ఏడాది పొడువునా పంటలు బాగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలుచేశారు. సర్పంచ్ పిల్లా వసుంధరతో పాటు మహిళలు అమ్మవారికి ముర్రాటలు చెల్లించుకున్నారు.

నేటి నుంచి గాలికుంటు టీకాలు

బొబ్బిలి రూరల్,సెప్టెంబరు 14(ఆంధ్ర జ్యోతి):మండలంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా సోమవారం నుంచి అక్టోబరు 15 వర కు పాడి పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు బొబ్బిలి పశు సంవర్థక శాఖ అధికారిఎల్.సుధాకర్ తెలిపారు.

నాగావళి వరద తగ్గుముఖం

గరుగుబిల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టుకు నాగావళి వరద ప్రవాహం ఆదివారం తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి 5,500 క్యూసెక్కుల వరద ప్రవాహం చేరగా, దిగువకు స్పిల్‌వే గేట్ల నుంచి 4,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సాగునీటి అవసరాల నిమిత్తం ప్రధాన కాలువల నుంచి 1,320 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 104.07 మీటర్ల నీరు నిల్వ ఉంది.



స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు విడిచిపెడుతున్న నీరు

కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో కబడ్డీ సంఘం ప్రతినిధులు

పాలకొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహించిన కబడ్డీ జిల్లా జట్ల ఎంపికలకు ఆదివారం జిల్లా నలుమూలల నుంచి 50 మంది బాలికలు, 70 మంది బాలురు పాల్గొన్నారు. ఫైనల్‌గా 14 మంది చొప్పున బాలురు, బాలికలు ఎంపికయ్యారు. వీరందరూ ఈ నెల 24 నుంచి 28 వరకు ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో మన్యం జిల్లా తరఫున పాల్గొంటారని మన్యం జిల్లా కబడ్డీ సంఘం గౌరవ అధ్యక్షుడు పల్లా కొండలరావు, ప్రెసిడెంట్ కోడి సుదర్శనరావు, సెక్రటరీ వెన్నపు చంద్రరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొంటారన్నారు.

'గాడిచర్ల'కు ఘన నివాళి

పాలకొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, గ్రంథాలయ ఉద్యమకారుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు జయంతిని ఆదివారం పాలకొండ శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత గాడిచర్ల చి త్రపటానికి ఉత్తరాంధ్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ఐక్యవేదిక సంఘం కన్వీనర్ నూతులపాటి భరత్‌భూషణ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్య క్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ బాసూరు కాంతారావు, వార్డు అడ్మిన్ శివ, కె.షన్ముఖరావు, జి.దుర్గారావు, సింహాచలం, పి.మధుసూదనరావు, మహేష్, డి.శ్యామలరావు, ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు, గ్రంథాలయ సహాయకుడు ఈశ్వర్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి

గరుగుబిల్లి, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను విద్యార్థులు వినియోగించుకోవాలని గ్రంథాలయ నిర్వాహకుడు నల్ల మధుసూదనరావు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు సెలవు రోజుల్లో విద్యార్థులకు పలు అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించడం జరుగుతోందని వివరించారు.

రామమందిరంలో సత్సంగం

పాలకొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని నాగవంశపువీధిలో గల రామమందిరంలో బోను చిన్నమ్మలు, భక్త బృందం ఆధ్వర్యంలో ఆదివారం దివ్యజీవన సత్సంగాన్ని నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి ప్రతినిధి ఎన్.వి. రమణ, కోటబొమ్మాళి మండలం రేగులపాడుకు చెందిన జి.మోహనరావు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. మానవుడు ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవాలంటే ఆధ్యాత్మిక మార్గం ఒక్కటే మార్గమన్నారు. అనంతరం రామాయణం, మహాభారతంలోని ఘట్టాలను వివరించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వక్తలు దామోదరావు, అప్పలనాయుడు, మోహన్‌రావు, సేవానందస్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచండి

గరుగుబిల్లి, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని మండల వైద్యాధికారి ఎస్.ఎం.కె. తిరుమల ప్రసాద్ సూచించారు. ఆదివారం ఆరోగ్యకేంద్ర ఆవరణలో పిచ్చి మొక్కలు, వ్యర్థాలు తొలగింపును ఆయన పర్యవేక్షించారు. ఆరోగ్య కేంద్రం ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దనున్నామన్నారు. ఖాళీ ప్రాంతాల్లో అవసరమైన మొక్కలను నాటేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలందించేందుకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు కార్యక్రమంలో సిబ్బంది జగదీశ్వరి, డి.మృత్యుంజయరావు, పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

24న బహిరంగ సభ

బొబ్బిలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి తాండ్ర పాపారాయ జంక్షన్‌లో ఈనెల 24న 1932 నాటి పూనా ఒడంబడికకు వ్యతిరేకంగా బహిరంగ సభ నిర్వ హించనున్నట్లు అంబేడ్కర్ పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య, భారత రిపబ్లికన్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి గొంప ప్రకాశరావు తెలిపారు. ఆదివారం బొబ్బిలిలోని ఎన్‌జీవో హోంలో పూనా ఒడంబడికకు వ్యతిరేకంగా బహిరంగసభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దళితనాయకులు ఎండ గోపాలరావు, సత్తి వెంకటరావు, రవికుమార్ పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్ అర్జీలను వెబ్‌సైట్‌లో నమోదు చేయవచ్చు

పార్వతీపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అర్జీల వివరాలను మీ కోసం వెబ్‌సైట్‌లో నమోదు చేయవచ్చునని కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సమర్పించిన అర్జీల స్థాయిను 1100 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. అన్ని కార్యాలయాల్లో ప్రజల సమస్యల అర్జీలను స్వీకరిస్తామన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రతిరోజూ ప్రజల నుంచి వినతులు స్వీకరించడానికి సెల్లార్‌లో ప్రత్యేకంగా సెల్‌ను ఏర్పాటు చేశామన్నారు. అర్జీదారులు మీకోసం.ఏపి.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చునన్నారు. అర్జీల స్థితి, దాని సమాచారం తెలుసుకోవడానికి 1100కు కాల్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ వివరించారు.

నేడు ఐటీడీఏలో పీజీఆర్‌ఎస్

సీతంపేట రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రతీ వారం మాదిరిగానే సోమవారం ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ కొనసాగుతుందని ఐటీడీఏ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు ఇన్‌చార్జి పీవోతో పాటు పలు శాఖలకు చెందిన అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

కూలిన పూరిళ్ల పరిశీలన

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జోగిపురంలో శనివారం చింతచెట్టు కూలి ఆరు పూరిళ్లు ధ్వంసమైన నేపథ్యంలో ఆదివారం తహసీల్దారు శేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆరుగురు బాధితులకు రూ.80 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కొత్తగా ఇళ్లు నిర్మించుకోవడానికి నిధులు మంజూరు చేస్తామని తహసీల్దార్ చెప్పారు.

రహదారి మధ్యలో నిలిచిన వాహనాలు

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రహదారులు అధ్వానంగా ఉన్నాయి. దీంతో వాహనాలలు ఎప్పటికప్పుడు రహదారిలో భారీ వాహనాలు నిలుస్తున్నాయి. ఆదివారం ఉదయం పాతబస్టాండ్ సమీపంలో ఒడిశా రాష్ట్రానికి ముడి సరుకు తీసుకువెళ్తున్న భారీ వాహనం రహదారిలో నిలిచి పోయింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వెంటనే పట్టణ పోలీసులు స్పందించారు. రహదారిలో మధ్యలో నిలిచిన వాహనాన్ని పక్కకు తీయించారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ●భామిని, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భామిని సమీపంలో రోడ్డుపై గుంతలో ఆదివారం ఉదయం రోడ్డుపై గుంతలో భారీ వాహనం నిలిచిపోయింది. ఆ రోడ్డుపై రాకపోకలు నిలిచాయి. ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. జాకీల సాయంతో అతికష్టంగా వాహనాన్ని డ్రైవర్ గుంత నుంచి తప్పించారు. రాకపోకలకు అవకాశం కలగడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. అలికాం-బత్తిలి ఇరుకు రహదారిలో తరచూ విశాఖ నుంచి ఒడిశాల లంజిఘడ్, ఛతీస్‌గడ్‌లకు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బిల్లుమడ నుంచి బత్తిలి వరకు రోడ్డు అడుగడుగునా గుంతలమయంగా ఉండటంతో తరచూ భారీ వాహనాలు ఇరుక్కోవడంతో స్థానికులకు ఇక్కట్లు తప్పడం లేదు.



భామిని సెంటర్‌లో నిలిచిన ట్రాఫిక్



పార్వతీపురం టౌన్: పాతబస్టాండ్ సమీపంలో రహదారిపై నిలిచిపోయిన లారీ